సాక్షి
నిజామాబాద్
గురువారం । 4 । మే । 2023



ముగిసిన 'సాక్షి' మాక్ ఎంసెట్

నగరంలో సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన సాక్షి మాక్ ఎంసెట్ పరీక్ష బుధవారం ముగిసింది.

- 8లో ▸



పని ఒత్తిడిలో పోలీసులు!

విధి నిర్వహణలో విరామం లేకపోవడంతో పనిభారం పెరిగి పోలీసులు ఒత్తిడికి లోనవుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.9

వాతావరణం

ఉదయం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశాలున్నాయి.

తెయూలో హై డ్రామా!

ఆసక్తికర పరిణామాల మధ్య తెలంగాణ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్ నిర్మల దేవి బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ పాలకమండలి నిర్ణయాన్ని కాదని యాదగిరి స్థానంలో ఆమెను వీసీ రవీందర్ నియమించారు. నిర్మల లీన్‌ను రద్దు చేస్తూ ఓయూ నుంచి ఉత్తర్వులు వెలువడినప్పటికీ తెయూ వర్సిటీగానే కొనసాగుతానని ఆమె స్పష్టం చేయడం కొసమెరుపు. ఈ పరిణామాలతో పాలక మండలి, వీసీ మధ్య పోరు తారాస్థాయికి చేరినట్లయ్యింది.



తెయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ నిర్మల దేవి

- రిజిస్ట్రార్ కుర్చీ కోసం ఎత్తుకుపైఎత్తులు
- ఉదయం నిర్మల దేవికి లీన్ అనుమతి, సాయంత్రం రద్దు ఉత్తర్వులు
- రేపు తెయూ పాలకమండలి సమావేశంపై ఉత్కంఠ
- రాజకీయాలను తలపిస్తున్న వర్సిటీ పరిణామాలు



ప్రొఫెసర్ నిర్మల దేవిని సత్కరిస్తున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్ నియామకంలో బుధవారం హై డ్రామా నెలకొంది. వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ హైకోర్టు మధ్యంతర రద్దు ఉత్తర్వుల ఆధారంగా ఈసీ నియమించిన ప్రొఫెసర్ యాదగిరి స్థానంలో వర్సిటీ కొత్త రిజిస్ట్రార్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్ నిర్మల దేవిని నియమించారు. ఆమె బుధవారం ఉదయం ఓయూ నుంచి ఏడాది కాలానికి లీన్ తీసుకుని తెయూ రిజిస్ట్రార్‌గా సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అయితే పాలనాపరమైన కారణాల వల్ల లీన్‌ను రద్దు చేస్తూ బుధవారం సాయంత్రం ఓయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఆమెను యథాస్థానంలో తిరిగి చేరాలని కోరుతూ ఉత్తర్వులు జారీచేయడం కలకలం రేపింది. రిజిస్ట్రార్‌గా నిర్మల దేవి బాధ్యతలు స్వీకరించక ముందే ఆమె లీన్ రద్దు చేస్తున్నట్లు ఓయూ జారీ చేసిన ఉత్తర్వులు అందినప్పటికీ వీసీ ఏమాత్రం పట్టించుకోలేదు. నిర్మల రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించగానే వీసీ కార్యాలయం ద్వారా ఆగమేఘాలపై రిజిస్ట్రార్ సిగ్నేచర్‌ను బ్యాంక్ అథరైజేషన్ కోసం పంపించడం గమనార్హం. అయితే అప్పటికే బ్యాంకు పని వేళలు ముగియడంతో బ్యాంక్ అధికారులు సిగ్నేచర్ అథరైజేషన్ చేయలేకపోవడం కొసమెరుపు.

వీసీ వర్సెస్ నవీన్ మిట్టల్ వ్యవహారం తెలంగాణ యూనివర్సిటీని మరింత వివాదంలోకి నెట్టేసింది. గత నెల 19న హైదరాబాద్‌లో జరిగిన 55వ తెయూ పాలకమండలి సమావేశాన్ని వీసీ వాకౌట్ చేయడం సంచనలం రేపింది. దీంతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ, విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, పాలకమండలి సభ్యులు రెండేళ్ల కాలానికి తెయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరిని నియమించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా విద్యావర్ధినిని తొలగిస్తూ, పాలకమండలి ప్రమేయం లేకుండా వీసీ రవీందర్ హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, విచ్చలవిడి కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుబారా తదితర అంశాలపై విచారణ జరపాలని తీర్మానం చేశారు. వీసీ అధికారాలకు కత్తెర వేసి రిజిస్ట్రార్‌కు హక్కులు కట్టబెట్టారు. దీంతో ఈసీ నిర్ణయాలను వీసీ హైకోర్టులో సవాల్ చేశారు. తుది తీర్పు వచ్చే వరకు ఈసీ నిర్ణయాలను రద్దు చేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం వీసీ రవీందర్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏకంగా నవీన్ మిట్టల్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని ప్రకటించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజిస్ట్రార్‌గా యాదగిరి నియామకం చెల్లదని, వారం రోజుల్లో ఓయూ నుంచి ఒకరిని రిజిస్ట్రార్‌గా నియమిస్తామని పేర్కొన్నారు. చెప్పినట్టే బుధవారం ఓయూ ఈసీఈ హెచ్‌వోడీ ప్రొఫెసర్ నిర్మల దేవిని తెయూ రిజిస్ట్రార్‌గా నియమించారు. కానీ సాయంత్రం అయ్యేసరికి ఓయూ నుంచి లీన్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్మల దేవిని వెనక్కు తిరిగి రావాని కొత్త ఉత్తర్వులు జారీ కావడం సంచనలం కలిగించింది.

ఈ విషయమై నిర్మల దేవిని సంప్రదించగా ఓయూ నుంచి లీన్ అనుమతి ఇస్తేనే తాను తెయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించానని, రద్దు ఉత్తర్వులు తనకు తెలియవన్నారు. తెయూ రిజిస్ట్రార్‌గా కంటిన్యూ అవుతానని స్పష్టం చేశారు.

అయితే లీన్ రద్దు చేసినా నిర్మల దేవి తిరిగి వెళ్లకపోతే ఓయూ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీస్ జారీ చేసి చర్యలు తీసుకునే అవకాశాలున్నట్లు సమాచారం.

నేడు హైకోర్టు తీర్పు వెలువడే అవకాశం..

ఈసీ నిర్ణయాలను రద్దుచేస్తూ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కోర్టులో దాఖలు చేసిన కౌంటర్ పై గురువారం ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సమాచారం. వీసీ తెచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేస్తే (స్టే వెకేట్) మళ్లీ అప్పుడు రిజిస్ట్రార్ ఎవరనేది ప్రశ్నార్థకంగా మారనుంది. దీనికి తోడు శుక్రవారం తెయూ ఈసీ సమావేశం నిర్వహించనున్నారు. ముందుగా ఆన్‌లైన్‌లో వర్చువల్‌గా ఈసీ సమావేశం నిర్వహించాలని భావించినా వర్సిటీలో జరుగుతున్న పరిణామాలపై ఆగ్రహంగా ఉన్న ఈసీ సభ్యులు ప్రత్యక్షంగా సమావేశం జరపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీసీ దుందుడుకు చర్యలు, నవీన్ మిట్టల్‌పై ఆరోపణలపై సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. వీసీపై మరిన్ని చర్యలకు తీర్మానం చేసే అవకాశాలున్నాయి.

రెండేళ్ల పదవీ కాలంలో వీసీ రవీందర్ ఆరుగురు రిజిస్ట్రార్లను మార్చారు. దీంతో వర్సిటీలో పాలన, టీచింగ్, పరిశోధన అటకెక్కాయి. తెయూ పాలకమండలి సభ్యుడు గంగాధర్‌గౌడ్ 'సాక్షి'తో మాట్లాడుతూ వీసీ రవీందర్ తన చర్యలతో వర్సిటీ పరువును గంగలో కలుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ ఆమోదం లేకుండా నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మల దేవి వర్సిటీ నిధుల్లో నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ నిర్మల దేవి

తెలంగాణ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎల్.నిర్మల దేవి నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం వీసీ డి.రవీందర్ ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. వెంటనే ఆమె రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నిర్మల దేవి ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. నిర్మలదేవి 23 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. టీచింగ్, నాన్-టీచింగ్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది అందరి సహకారంతో తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వ్యక్తులు ముఖ్యం కాదని వ్యవస్థ ముఖ్యమన్నారు. మీడియా నిజమైన వార్తలు ప్రచురించాలని వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీసీ రవీందర్ మాట్లాడుతూ.. త్వరలోనే తెయూలో ఇంజినీరింగ్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. పరిశోధనలకు ప్రాధాన్యత నిచ్చే నిర్మల దేవిని రిజిస్ట్రార్‌గా నియమించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం వీసీ రవీందర్, రిజిస్ట్రార్ నిర్మలదేవిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

న్యూస్‌రీల్

నిజామాబాద్ ఏఎంసీ గ్రేడ్-2 సెక్రెటరీగా విజయ్‌కిషోర్



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో విజయ్‌కిషోర్‌కు గ్రేడ్-2 సెక్రెటరీగా పదోన్నతి కల్పిస్తూ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఇదే మార్కెట్ కమిటీలో గ్రేడ్-3 సెక్రెటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ-నామ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ఆయనకు పదోన్నతి కల్పించారు. విజయ్‌కిషోర్ గ్రేడ్-2 సెక్రెటరీగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలోనే విధులు చేపట్టనున్నారు. కాగా ఆయనకు పదోన్నతి లభించడంపై సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం, యూనియన్ నాయకులు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, కమిటీ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం



సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మోపాల్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, మాక్లూర్, నిజామాబాద్‌తో పాటు పలు మండలాల్లో భారీ వర్షం పడింది. వర్షానికి ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా రానున్న మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



డిచ్‌పల్లి: అకాలవర్షాలకు తడిసిన వడ్లను, తడవకుండా ఆరిన వడ్లను కాంటా చేసి వేర్వేరుగా లారీల్లో నింపి రైస్‌మిల్లులకు పంపించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్మారం(బి)లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వడ్లు తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసి తేమశాతం అధికంగా ఉన్న వడ్లను బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ రామకృష్ణ, రైతులు ఉన్నారు.

ఎనిమిది మందిపై కేసు

కామారెడ్డి క్రైం: ఓపెన్ ఎస్సెస్సీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఎనిమిది మందిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీవాడ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో మంగళవారం నలుగురు విద్యార్థుల స్థానంలో ఇతరులు పరీక్షలు రాస్తున్నట్లుగా చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి గుర్తించారన్నారు. వారి పేపర్లను స్వాధీనం చేసుకుని, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరీక్ష కేంద్రంలో ఇతరుల స్థానంలో పరీక్ష రాస్తున్న నలుగురు వ్యక్తులతోపాటు వారిని పంపిన విద్యార్థులు నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

మంజీర పుష్కరాల ముగింపు

బాన్సువాడ: మంజీర పుష్కరాలు బుధవారం ముగిశాయి. గతనెల 23 న గరుడ గంగ మంజీర పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. చివరిరోజు పుష్కర కమిటీ ఆధ్వర్యంలో బాన్సువాడలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మ ముహూర్తంలో హోమం, హనుమాన్ చాలీసా పారాయణం, వాసవి మాత పారాయణం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పుష్కర కమిటీ అధ్యక్షుడు గాజుల రాజులు, ప్రధాన కార్యదర్శి భూంరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రోహిత్, నాయకులు కాసుల సాయికుమార్, రాజు, రాఘు, కృష్ణమూర్తి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లు లేక తిప్పలు..!

- మండల వ్యవసాయ కార్యాలయాలకు సరఫరా చేయని ప్రభుత్వం
- మొరాయిస్తున్న పదేళ్ల క్రితం నాటి ల్యాప్‌టాప్‌లు
- పంటల వివరాలు, డేటా నమోదులో సిబ్బందికి ఇబ్బందులు



జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పంట నష్టం వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాల్లో కంప్యూటర్లు కరువయ్యాయి. ప్రభుత్వం కొత్తవి సరఫరా చేయకపోవడంతో ఎంఏవోలు, ఏఈవోలు ప్రభుత్వ పనులను వేగవంతంగా చేయలేకపోతున్నారు. పదేళ్ల క్రితం ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు మొరాయిస్తున్నాయి. తద్వారా పంటలసాగు, పంటనష్ట వివరాలు, ఇతర డేటాను జిల్లా శాఖకు, ప్రభుత్వానికి పంపించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొసైటీ కార్యాలయాలు, ప్రైవేటు డీలర్ల దుకాణాలకు వెళ్లి పని చేసుకోవాల్సి వస్తుందని పలువురు వ్యవసాయాధికారులు వాపోతున్నారు. జిల్లాలో 33 మండలాలు ఉండగా, పాత మండలాల్లోనే వ్యవసాయాధికారి కార్యాలయాలున్నాయి. మండల వ్యవసాయాధికారితో పాటు ఏఈవోలు ఇందులో పనిచేస్తారు. పంటల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడానికి ప్రభుత్వం ఏఈవోలకు ట్యాబ్‌లు అందజేసింది. వీటిద్వారా కేవలం పంట సాగు లెక్కలను మాత్రమే నమోదు చేయడానికి అవకాశం ఉంది. కానీ, పంటనష్ట డేటాను, ఇతర రిపోర్టులను టైప్ చేసి పంపడానికి కంప్యూటర్లు అందుబాటులో లేవు. నాలుగైదు మండలాలు మినహా ఇతర మండలాల్లో లేకపోవడంతో వేరేచోటుకు వెళ్తున్నారు. స్టేషనరీకి కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. సొంతగా ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లా కార్యాలయానికి వచ్చి..

మండలాల్లో కంప్యూటర్లు లేక పంటనష్ట వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు చేరవేయలేకపోతున్నారు. తద్వారా మండలాల నుంచి ఎంఏవోలు, ఏఈవోలు జిల్లా వ్యవసాయ శాఖకు వచ్చి కంప్యూటర్లలో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రొటెక్టెడ్ ఫార్మాట్ ఇవ్వడంతో మండలాల్లో చేయడానికి కూడా కుదరలేదు. నాలుగైదు రోజులుగా వ్యవసాయాధికారులు జిల్లా కార్యాలయంలో కంప్యూటర్లతో కుస్తీ పడుతున్నారు. అదనపు కంప్యూటర్లు ఏర్పాటు చేసి పంటనష్ట లెక్కలను వేగవంతంగా నమోదు చేస్తున్నారు.

ఎక్కడ లేవో తెలుసుకుంటాం

గతంలోనే మండల వ్యవసాయాధికారులకు ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు అందజేసింది. అవి మొరాయిస్తున్న విషయం నాదృష్టికి రాలేదు. కంపూటర్లు ఎక్క డ అందుబాటులో లేవో తెలుసుకుంటాం. పంటనష్ట వివరాల నమోదులో ఇబ్బందులు లేవు.

–ఆర్.తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అర్బన్‌పార్కు పనులు పూర్తిచేయాలి

- సందర్శకులను ఆకట్టుకునేలా అన్ని హంగులతో నిర్మించాలి
- సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్



మాక్లూర్ మండలం చిన్నాపూర్ అర్బన్ పార్కును పరిశీలిస్తున్న స్మితా సబర్వాల్, ప్రియాంక వర్గీస్

మాక్లూర్: అర్బన్ పార్కు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని అడవిమామిడిపల్లి శివారులో గల చిన్నాపూర్ అర్బన్ పార్కును సందర్శించారు. పార్కులో కొనసాగుతున్న ఓపెన్ జిమ్‌లు, ప్లే జోన్ ఏరియా, కల్వర్టుల నిర్మాణాలు, పర్క్యులేషన్ ట్యాంకులు, వాచ్‌టవర్, రోడ్డు నిర్మాణాల పనులను పరిశీలించారు. 4,11 ఎకరాలపై చిలుకు విస్తీర్ణం ఆటవీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న అర్బన్ పార్కు సందర్శకులను ఆకట్టుకునేలా అన్ని హంగులతో నిర్మాణం జరగాలన్నారు. 126 ఎకరాల విస్తీర్ణంలో సందర్శకుల కోసం అన్ని రకాల సదుపాయాలతో అందుబాటులోకి తెస్తామని డీఎఫ్‌వో వికాస్ మీనా వారికి వివరించారు. రూ 5.58 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అర్బన్ పార్కు నిర్మాణంలో ఇప్పటికే రూ 5 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. రోడ్లు, నీటి వసతి, టాయిలెట్స్, సౌకర్యాలు పూర్తయి సిద్ధంగా ఉన్నాయని తెలపగా మిగిలిన పనులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వారు ఆదేశించారు. పార్కులో చెరువులు, నీటి ట్యాంకులు ఉన్నందున సందర్శకుల కోసం బోటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. వారి వెంట జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీపీవో జయసుధ, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ మామిడిపల్లి సర్పంచ్ మల్లారెడ్డి తదితరులున్నారు.

మొక్కలు పెంచడం అందరి బాధ్యత

ఖలీల్‌వాడి: మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడాన్ని అందరూ అలవాటుగా చేసుకోవాలని సీఎం కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ సూచించారు. బుధవారం ఆమె కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, డీఎఫ్‌వో వికాస్ మీనాలతో కలిసి జిల్లా జైలులోని నర్సరీని సందర్శించారు. ఎడపల్లి మండలం కుర్నాపల్లిలోని హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలను చక్కగా నిర్వహిస్తుండడంపై నిర్వాహకులను, సిబ్బందిని అభినందించారు. జిల్లా జైలులో సింగపూర్ చెర్రీ రకం చెట్లు ఉండడాన్ని గమనించిన ఓఎస్‌డీ, జైలు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఏపుగా పెరిగి గొడుగు తరహాలో చక్కటి నీడను అందించే సింగపూర్ చెర్రీ మొక్కలను ప్రధాన రహదారులకు ఇరువైపులా విరివిగా నాటించాలని జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాకు సూచించారు. ఈ చెట్టు ఏడాది పొడవునా పూలు, చిన్నచిన్న పండ్లను అందిస్తుందని, ఫలితంగా పక్షులకు ఆవాసంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఖైదీలు తయారు చేస్తున్న ట్రీగార్డులు, బుక్ బైండింగ్, ప్రింటింగ్ సామాగ్రిని పరిశీలించి చక్కగా పనిచేస్తున్నారంటూ వారిని ప్రోత్సహించారు. ఆమె వెంట డీఆర్డీవో చందర్, జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ రాజశేఖర్, ఆర్డీవో రవి తదితరులున్నారు.

క్రమబద్ధీకరణ కొందరికే..!

- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఫైల్‌పై సీఎం సంతకం
- జిల్లాలో కొందరికే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ
- పెండింగ్‌లోనే అనేక మంది క్రమబద్ధీకరణ

మోర్తాడ్(బాల్కొండ): ఊరించి ఉసూరుమనిపించినట్లు ఉంది కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని గతంలో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇందుకు అనుగుణంగా ఫైల్‌పై సంతకం చేసిన విషయం విదితమే. కానీ సగం మందికి మాత్రమే క్రమబద్ధీకరణ వర్తింపజేశారు. మిగిలిన వారికి మొండి చేయి చూపించారు. దీంతో రెగ్యులరైజేషన్ కాని ఉద్యోగులు ప్రభుత్వం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2022–23 బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 11,500ల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సాక్షాత్తు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆదివారం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 5,544 మందిని రెగ్యులరైజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ లెక్కన 50 శాతం మంది ఉద్యోగులకే ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మిగిలిన వారిని కాంట్రాక్టు విధానంలోనే కొనసాగించనుండడం గమనార్హం. జూనియర్ కళాశాలల్లోని ఉద్యోగులే ఎక్కువగా రెగ్యులరైజ్ చేయబడ్డారు.

డిగ్రీ కళాశాలల్లో సగం మంది కాంట్రాక్టు అధ్యాపకులకే ప్రభుత్వం నుంచి సానుకూలత లభించింది. సెట్, నెట్, పీహెచ్‌డీలలో ఏదో ఒకటి క్వాలీఫై అయినవారినే రెగ్యులరైజ్ చేయడానికి అవకాశం కల్పించారు. 2016 తర్వాత సెట్, నెట్, పీహెచ్‌డీలు పొందినవారికి క్రమబద్ధీకరణ చేయలేదు. జిల్లాలో 99 మంది డిగ్రీ అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తుండగా ఇందులో 55 మందికి రెగ్యులరైజ్ కావడానికి అవకాశం లభించింది. జూనియర్ కళాశాలల్లో 148 మందికి గాను ఇద్దరిని మినహాయించి మిగిలిన అందరిని రెగ్యులరైజ్ చేశారు. వొకేషనల్, ఐటీఐ అధ్యాపకులకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వర్తించలేదు. వైద్య ఆరోగ్య శాఖలో 101 మందిని క్రమబద్ధీకరించాల్సి ఉండగా ఈ శాఖకు సంబంధించి మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో ఎవరు రెగ్యులరైజ్ అవుతారో ఎవరు పాత పద్ధతిలో కొనసాగుతారో స్పష్టత లభించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో ఇచ్చిన హామీ ప్రకారం అందరు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

మరి.. మా పరిస్థితి ఏంటీ?

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే జిల్లాలో అనేక చోట్ల ఆరబోసిన వడ్లకు మొలకలు వస్తున్నాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. మరి మా పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ముదక్‌పల్లిలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

క్లుప్తంగా

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్‌: ట్రాన్స్‌కో సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్‌ అన్నారు. పట్టణంలోని మిలాన్‌ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఆర్మూర్‌, పెర్కిట్‌ సబ్‌ డివిజన్‌ ఉద్యోగ కార్మికులకు విద్యుత్‌ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్య నిర్వహణలో ప్రమాద నివారణకు ఖచ్చితంగా సేఫ్టీ బెల్ట్‌, ఎర్త్‌రాడ్‌, హెల్మెటు ధరించి పనులు చేయాలన్నారు. లైన్‌లో విద్యుత్‌ ప్రవహించడం లేదని నిర్ధారణ చేసుకున్న తర్వాతే పని మొదలు పెట్టాలన్నారు. అనంతరం సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ట్రాన్స్‌కో డీటీ రమేష్‌, డీఈ హరిచంద్‌, ఏడీఈ శ్రీధర్‌, డివిజన్‌స్థాయి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'దివ్యాంగులకు శాశ్వత ధ్రువీకరణ పత్రం ఉంటేనే రిజర్వేషన్లు'

కామారెడ్డి రూరల్‌: రాష్ట్రంలోని దివ్యాంగులకు ఇకపై శాశ్వత ధ్రువీకరణ(పర్మినెంట్‌ సర్టిఫికెట్లు) ఉంటేనే విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల కోసం రిజర్వేషన్లు కల్పించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్ర దివ్యాంగులు, స్త్రీశిశు సంక్షేమశాఖ తాజాగా ఉత్తర్వు(జీవో నం. 41)లు జారీ చేయడంపై బుధవారం రాష్ట్ర వికలాంగుల సమితి జిల్లా అధ్యక్షుడు జంగం శ్రీశైలం హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల కోసం అభ్యర్థులు తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించిందని, దీని వల్ల చాలామంది వైకల్యంలేని వారు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకొని సీట్లు, ఉద్యోగాలు పొందుతున్నట్లు తేలిందన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకోవాలని అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, ప్రభుత్వం స్పందించి తాజా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌): అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలు తీరును ట్రైనీ కలెక్టర్‌ శివేంద్ర ప్రతాప్‌ బుధవారం బీర్కూర్‌లో పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు, కార్యాచరణకు సంబంధించిన వివరాలను ఎంపీడీవో భాను ప్రసాద్‌, స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

పని ఒత్తిడిలో పోలీసులు!

- వారాంతపు సెలవు ఇస్తామంటూ 2014లో సీఎం కేసీఆర్‌ ప్రకటన
- మూణ్నాళ్ల ముచ్చటగా మారిన వైనం
- సిబ్బంది కొరతే కారణం?

ఖలీల్‌వాడి: పోలీసులు 24 గంటల పాటు విధినిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలు కాపాడుతుంటారు. ఎప్పుడు ఎలాంటి ఘటనలు జరిగిన నిమిషాల్లో పోలీసులు అక్కడ వాలిపోతుంటారు. పరిస్థితులను పరిశీలించి, తగిన చర్యలు చేపడతారు.విధి నిర్వహణలో వారికి విరామం లేకపోవడంతో పనిభారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నారు.

సిబ్బందికి సెలవులు ఇలా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత పోలీసులకు పని ఒత్తిడి కాకుండా వ్యక్తిగత పనులు చూసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వారాంతపు సెలవు విధానం ప్రవేశపెట్టి మురిపించింది. 2014 నవంబర్‌లో సీఎం కేసీఆర్‌ స్వయంగా పోలీసులకు వారాంతపు సెలవులు ఇస్తామని ప్రకటించారు. నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను బట్టి వారంలో ఇద్దరు లేదా ముగ్గురికి సెలవు ఉండేవి. పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉంటే వారంలో ప్రతి ఒకరు ఒక రోజు సెలవు తీసుకునే అవకాశం ఉండేది. మిగిలిన పోలీసులు విధులకు ఉండేవారు. కమిషనరేట్‌ పరిధిలోని ట్రాఫిక్‌ విభాగంలో ఎక్కువగా వారంతరపు సెలవులు జరిగినట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మూడు నెలలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మళ్లీ పాత విధానంలోనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సీఎం కేసీఆర్‌ ఇచ్చిన ప్రకటన మూడునాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

పోస్టులు భర్తీ చేస్తేనే..


నిజామాబాద్‌ పోలీస్‌కమిషనరేట్‌ పరిధిలో సిబ్బంది కొరత ఉంది. కొత్త సిబ్బంది వస్తే వారంతరపు సెలవులకు అవకాశం ఉంటుందనే చర్చ పోలీస్‌శాఖలో జరుగుతోంది. ప్రతి ఒక్కరూ కుటుంబంతో గడపాలని కోరుకుంటారు. విధి నిర్వహణలో పోలీసులకు టైమ్‌కు భోజనం దొరకని పరిస్థితి ఉంటుంది. దీంతో అనారోగ్యం బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. సెలవులు ఉంటే పోలీసులకు విరామంతోపాటు పని ఒత్తిడిని సైతం తగ్గించినట్లవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

నెలంతా విధుల్లోనే..

పోలీసు ఉద్యోగంలో 24గంటలు అందుబాటులో ఉన్నా.. నెలలో నాలుగు రోజుల సెలవులు కూడా ఉండటం లేదు. అయినా ఉద్యోగులకు నెలకు నాలుగు రోజుల జీతం కూడా ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. దీంతో ఆర్థికంగా శారీరకంగా, మానసికంగా, నష్టపోతున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వం సెలవులకు అదనంగా చెల్లిస్తే బాగుంటుందని కొందరు పోలీసులు అంటున్నారు.

ఓ పోలీసు సిబ్బంది మనోగతం..

నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో ఉన్న పోలీసు ప్రతిరోజు విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు వేరే చోట ఉండటం వారిని వారంలో ఒకసారి కలవడానికి వీలులేకుండా పోతుంది. అలాగే పిల్లల చదువు విషయంలో పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకునే పరిస్థితి లేకుండా పోయింది. సెలవులు ఇచ్చినప్పుడు వారానికి ఒకసారి వెళ్లి తల్లిదండ్రులను చూసేవాడిని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విరామం లేని విధి నిర్వహణతో బంధువుల శుభకార్యాలకు సైతం వెళ్లలే కపోతున్నట్లు తెలిపారు.



నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి..

పోలీస్‌ కమిషనర్‌
డీసీపీలు – 3
జిల్లాలో పోలీస్‌స్టేషన్‌లు – 32

సివిల్‌ పోలీసులు		ఏఆర్‌ పోలీసులు(ఆర్మ్‌డ్‌)	
ఏసీపీలు	7	ఏసీపీలు	2
సీఐలు	26	ఆర్‌సీఐలు	5
ఎస్సైలు	81	ఆర్‌ఎస్సైలు	12
ఏఎస్సైలు	85	ఆర్‌ఏఎస్సైలు	34
హెడ్‌కానిస్టేబుల్స్‌	200	ఆర్‌హెడ్‌కానిస్టేబుల్స్‌	100
కానిస్టేబుల్స్‌	679	ఆర్మ్‌డ్‌ కానిస్టేబుల్స్‌	283

నకిలీ పత్రాలతో రూ. 70 లక్షల ఇన్సూరెన్స్‌ డబ్బులు డ్రా

- హైదరాబాద్‌ ఎల్బీనగర్‌లోని ఓ బ్యాంకులో ఘటన
- బోధన్‌లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సైబర్‌ క్రైమ్‌ పోలీసులు

బోధన్‌టౌన్‌ (బోధన్‌): హైదరాబాద్‌కు చెందిన ఓ బ్యాంకు నుంచి ఇన్సూరెన్స్‌ డబ్బులు విత్‌డ్రా చేసి నిజామాబాద్‌ జిల్లా బోధన్‌లో బంగారం కొనుగోలు చేసిన ఘటన కలకలం రేపుతోంది. పోలీసు వర్గాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం.. హైదరాబాద్‌ ఎల్బీనగర్‌ పరిధిలోని ఓ బ్యాంకులో ఎన్‌ఆర్‌ఐకి చెందిన ఇన్సూరెన్స్‌ డబ్బులు రూ. 70 లక్షలు వివిధ దశల్లో విత్‌డ్రా చేసిన ఘటనలో బోధన్‌కు చెందిన ఇరువురిపై మంగళవారం బోధన్‌కు వచ్చిన సైబర్‌ క్రైమ్‌ పోలీసులు రెక్కి నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున ఎస్సై బృందం అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఎల్బీనగర్‌ బ్యాంకు ఇన్సూరెన్స్‌ విభాగంలో పనిచేసే బోధన్‌కు చెందిన ఒకరు , బ్యాంకుకు సంబంధంలేని మరో వ్యక్తి ఉన్నారు. ఇటీవల కాలంలో ఎల్బీనగర్‌లోని ఓ బ్యాంకులో ఓ ఎన్‌ఆర్‌ఐ ఇన్సూరెన్స్‌కు చెందిన డబ్బులు సుమారు 12 ఏళ్లుగా క్లెయిమ్‌ చేయకుండా ఉండడాన్ని గమనించిన బ్యాంకు ఇన్సూరెన్స్‌ విభాగం ఉద్యోగి, బోధన్‌కు చెందిన పలువురు వ్యక్తుల భాగస్వామ్యంతో నకిలీ పత్రాలను సృష్టించి రూ. 70 లక్షలు విత్‌డ్రా చేశారు. బ్యాంకు నిబంధనల మేరకు కొంత బంగారం కొనుగోలు చేయాల్సి ఉండగా ఈ డబ్బులతో హైదరాబాద్‌లోనే బంగారాన్ని కొనుగోలు చేశారు. అనంతరం బంగారాన్ని బోధన్‌లో స్థానిక యువకుడితో సహకారంతో అమ్మడానికి ఓ దుకాణానికి వెళ్లగా యజమాని కొనుగోలుకు ముందుకు రాలేదు. తర్వాత పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ప్రమేయంతో దుకాణం యజమాని 3 దఫాలుగా బంగారాన్ని కొనుగోలు చేశాడు. ఇదే సమయంలో ఎన్‌ఆర్‌ఐ తనకు చెందిన ఇన్సూరెన్స్‌ డబ్బుల విషయం బ్యాంకులో విచారించగా విత్‌ డ్రా అయినట్లు సిబ్బంది తెలిపారు. దీంతో ఎన్‌ఆర్‌ఐ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్‌ క్రైమ్‌ పోలీసులు దర్యాప్తులో భాగంగా బ్యాంకు ఇన్సూరెన్స్‌ విభాగంలో పనిచేసే ఉద్యోగిని, మరో యువకుడితో పాటు బంగారం దుకాణం యజమానిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌ తరలించినట్లు తెలిసింది. ఈ కేసులో మరో ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది.

సత్ప్రవర్తనతో మెలగాలి

కామారెడ్డి క్రైం: శిక్షా కాలం పూర్తయిన తర్వాత ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి బి శ్రీదేవి అన్నారు. కామారెడ్డిలోని సబ్‌జైలును బుధవారం ఆమె సందర్శించారు. సబ్‌ జైలులోని సౌకర్యాలను పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఇంద్రసేన్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సాక్షి' మాక్‌ ఎంసెట్‌



సాక్షి ఎంసెట్‌ మాక్‌ టెస్ట్‌కు హాజరైన విద్యార్థినులు

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌ ఎంసెట్‌ పరీక్ష బుధవారం ముగిసింది. గత రెండు రోజులుగా నిర్వహించిన పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మొదటి రోజు ఇంజనీరింగ్‌ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించగా, రెండో రోజు మెడిసిన్‌ విభాగంలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రతిఏటా సాక్షి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు మాక్‌ ఎంసెట్‌ పరీక్ష నిర్వహిస్తూ వస్తుంది. 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష వల్ల భయాన్ని పోగొట్టుకోవడం, పరీక్ష నిర్వహణ ఎలా ఉంటుంది అనే అంశాలను విద్యార్థులు తెలుసుకుంటున్నారు. కాగా నిషిత డిగ్రీ కళాశాలలో రెండో రోజు నిర్వహించిన మెడిసిన్‌ విభాగ పరీక్షకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు పరీక్ష కొనసాగింది. పరీక్షకు ఎస్‌ఆర్‌ కళాశాల యాజమాన్యం సహకారం అందించింది. సాక్షి బ్రాంచ్‌ మేనేజర్‌ పల్లె మహేష్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపయోగకరంగా ఉంది..



"సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసెట్‌ మాక్‌ టెస్ట్‌ ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాలో భయాన్ని పోగొట్టింది. ఈ పరీక్ష రాయడం వల్ల ఎంసెట్‌ పరీక్ష తేలికగా రాయగలుగుతానని నమ్మకం కుదిరింది. ఇలాంటి పరీక్షలు ఎల్లప్పుడూ నిర్వహించాలి. విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి."

–స్వప్న, విద్యార్థిని, నిజామాబాద్‌

పరీక్ష భయం పోయింది..



"నేను మొదటిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్ష రాయడం వల్ల భయం పోయింది. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్‌ పరీక్షను తేలికగా రాయగలుగుతాను. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష నాకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది."

–బి.సాక్షి, విద్యార్థిని, నిజామాబాద్‌

మరింత చదివేందుకు ఉపయోగపడింది..



"ఆన్‌లైన్‌ మాక్‌ ఎంసెట్‌ పరీక్ష వల్ల నేను మరింత మెరుగ్గా చదవాలని తెలుసుకున్నాను. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష ప్రశ్నాపత్రాల సరళి చాలా అద్భుతంగా ఉంది. ఇలాంటి ఎంట్రెన్స్‌ పరీక్షలు మరెన్నో నిర్వహిస్తే ఎంతో బాగుంటుంది. విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది."

–రవళి, విద్యార్థిని, నల్లూరు

మంచి మార్కులు వస్తాయి..



"సాక్షి నిర్వహించిన ఎంసెట్‌ మాక్‌ టెస్ట్‌ వల్ల నాకు మంచి మార్కులు వస్తాయనే నమ్మకం కలిగింది. ప్రభుత్వ నిర్వహించే ఎంసెట్‌ పరీక్షకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాయగలుగుతాను. నేను చదువుకున్న దానికి అనుగుణంగా పేపర్‌ ఎలా ఉంది అనేది అర్థం అయ్యింది. మంచి మార్కులు సాధిస్తాం."

–స్నేహ, విద్యార్థిని, చందూర్‌

జీపీ కార్యాలయానికి తాళం

రాజంపేట: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో సర్పంచ్‌ కొమ్ము యాదగిరి తమ గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి మండల పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శులను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. తమ కార్యదర్శి తమ కార్యాలయానికి వచ్చే వరకూ.. తాళం తీసేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నయంగా ఇన్‌చార్జి కార్యదర్శిని పంపితే ఒప్పుకోబోమని తెలిపారు.

కార్యాలయానికి తాళం వేస్తున్న సర్పంచ్‌



ధాన్యంలో మొలకలు.. రైతుల్లో దిగులు



నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారంలో నేలకొరిగిన వరి పంట

అకాల వర్షాల కారణంగా కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం మొలకెత్తుతున్నాయి. అలాగే రోడ్లపై ఆరబెట్టిన ధాన్యంను కూలీల కొరత, సంచులు అందుబాటులో లేకపోవడంతో తరలించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపైనే ధాన్యం కుప్పల వద్ద నిత్యం ఉండాల్సి వస్తోందని, ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఇబ్బందులకు గురవుతున్నమని అన్నదాతలు పేర్కొంటున్నారు. మరో పక్క గుండారం శివారులో వరి పంట మొత్తం నేలకొరిగింది.

–సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



మెంట్రాజ్‌పల్లి రోడ్డు పక్కన ధాన్యం కుప్పలు



ముదక్‌పల్లిలో మొలకెత్తిన వరిధాన్యం





ముదక్‌పల్లి శివారులో ఆరబెట్టిన ధాన్యంలో మొలకలు..



డిచ్‌పల్లి మండలం నవ్యాతండా వద్ద తడిసిన ధాన్యం

క్రీడలను ప్రోత్సహించడానికే వేసవి క్యాంపులు



నిజామాబాద్‌నాగారం: క్రీడలను ప్రోత్సహించడానికే వేసవి క్యాంపులు నిర్వహిస్తున్నామని నిజామాబాద్‌ జిల్లా యువజన సంక్షేమ శాఖ, క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న అన్నారు. గురువారం వేసవి సైక్లింగ్‌ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముత్తెన్న మాట్లాడుతూ.. క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాలలో సాధన చేసి అంతర్జాతీయ స్థాయిలో మన జిల్లా పేరు ప్రతిష్టలు పెంపొందించాలన్నారు. జాతీయ స్థాయి సైక్లిస్టు ఇంచార్జి కోచ్‌గా రాఘవేంద్రను నియమించారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలి



ఆర్మూర్‌లోని నిజాంసాగర్‌ కాలువ బ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ఆర్మూర్‌టౌన్‌: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం చెల్లించాలని పీసీసీ మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని నిజాంసాగర్‌ కాలువ బ్రిడ్జిపై రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా మార చంద్రమోహన్‌ మాట్లాడుతూ.. గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయిందని, నువ్వుల పంట, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం తక్షణ సాయం కింద రైతులకు రూ.10 వేలను అందజేస్తూ పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి నష్ట పరిహారం అందజేయాలన్నారు. కాంగ్రెస్‌ నాయకుడు కోలా వెంకటేష్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ధాన్యం ఆరబోసుకోవడానికి కల్లాలను ఏర్పాటు చేయకపోవడం వల్లే పంట నష్టం జరిగిందన్నారు. నాయకులు సాయిబాబా గౌడ్‌, విట్టం జీవన్‌, మీర్‌ మాజీద్‌ అలీ, పోశెట్టి, నక్కల చిన్నారెడ్డి, నర్సారెడ్డి, రవి, హబీబ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

పలువురిపై కేసులు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో పలువురిపై బుధవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఆరుగురిపై, మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మాధవపల్లి, జువ్వాడి శివార్లలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన అర్ల విజయ్‌, అర్ల మహేందర్‌, కొల్లూరు సాయిరాం, బీమరేని అశోక్‌, సదాశివనగర్‌ మండలం జనగామకు చెందిన గంట సంతోష్‌, గంగాధర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన జువ్వాడి గ్రామానికి చెందిన చాకలి భూమయ్య, జనగామకు చెందిన మూలిగె రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై పోక్సో కేసు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట గ్రామంలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్‌ బుధవారం తెలిపారు. బాలికపై అత్యాచారం చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సదరు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలో బుధవారం ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడగా.. డ్రైవరు గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని చద్మల్‌ శివారులో మైనింగ్‌ ముడిసరుకుతో లారీ హైదరాబాద్‌కు వెళ్తుండగా.. గాంధారి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గమనించిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పిట్లం: సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌కొండ సూచించారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్‌ వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులకు ట్రాఫిక్‌ నియమ నిబంధనలు, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు వివరాలు ఇవ్వొద్దని ఆయన పేర్కొన్నారు.



హైవేపై కూలిన భారీ సూచిక బోర్డు



జాతీయ రహదారిపై కూలిన భారీ సూచిక బోర్డును పక్కకు తొలగిస్తున్న వాహనాల డ్రైవర్లు

డిచ్‌పల్లి: మండల కేంద్రం శివారులోని 44వ నెంబరు జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం వీచిన ఈదురు గాలుల దాటికి భారీ సూచిక బోర్డు కుప్పకూలింది. ఆర్మూర్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్లే దారిలో హైవే అథారిటీ వారు వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ బోర్డు ఇలా రహదారిపై కుప్పకూలడం ఇది రెండోసారి. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాలు దూరంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. బోర్డు పడిపోవడం గమనించిన లారీ డ్రైవర్లు తమ వాహనాలను దూరంగా నిలిపివేశారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. హైవే అధికారులు, టోల్‌ప్లాజా సిబ్బందికి, డిచ్‌పల్లి పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. అయితే గంట సమయం గడిచినా హైవే సిబ్బంది, పోలీసులు రాకపోవడంతో చేసేది లేక నిలిచిపోయిన లారీలు, ఇతర వాహనాల డ్రైవర్లు కిందకు దిగి స్వయంగా భారీ సూచిక బోర్డును పక్కకు తొలగించారు. అనంతరం వాహన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. మరోసారి ఇలాంటి ప్రమాదం జరుగకుండా హైవే అధికారులు బోర్డును పటిష్టంగా బిగించాలని స్థానికులు కోరుతున్నారు.